- ఎక్కడెక్కడి నుంచో ఒక్కచోట చేరి
- ఇంటిల్లిపాది ఆనందంగా గడుపుతూ...
- ఘనంగా వేడుక జరుపుకుంటున్న ప్రజలు

సంక్రాంతి సందడి

ఉమ్మడి కుటుంబం.. పండుగ వైభవం



అన్నదమ్ముల ముచ్చట్లు.. యారాళ్ల చేతివంటలు.. ఆడపడుచుల కబుర్లు.. బావబామ్మర్దుల పలకరింపులు.. చిన్నారుల కేరింతలు. ఉమ్మడి కుటుంబంతో కళకళలాడుతున్న ఇండ్లు. ఈ ఆనంద క్షణాన్ని చూసి తల్లిదండ్రుల కళ్లలో కనిపించే ఆనందభాష్పాలు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఇంటింటా ఆవిష్కృత మయ్యే దృశ్యాలు ఇవీ. ఉద్యోగం.. ఉపాధి.. పిల్లల ఉన్నతవిద్య, తదితర కారణాలతో ఉమ్మడి కుటుంబాలు విడిపోయి వేర్వేరు చోట్ల జీవనం సాగిస్తున్న తరుణం ఇది. ఎక్కడెక్కడో స్థిరపడిన వారిలో పండుగలకు సొంత ఊరు చేరి కుటుంబ సభ్యులతో సరదాగా గడుపుతున్న వారు కొందరే. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని పలు ప్రాంతాలకు చెందినవారు వివిధ ప్రదేశాల్లో స్థిరపడినా.. సంక్రాంతికి సొంతింటికి వస్తామని చెబుతున్నారు. తల్లిదండ్రులతో ఆనందంగా పండుగ జరుపుకుంటామని అంటున్న వారిపై కథనం..!!

చెప్పలేని ఆనందం


బోయినపల్లిలో శ్రీపతి శ్రీహరి కుటుంబం

బోయినపల్లి(చొప్పదండి): రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలకేంద్రానికి చెందిన శ్రీపతి లక్ష్మి–శ్రీహరి దంపతులకు నలుగురు కొడుకులు శ్రీనివాస్, చంద్రమౌళి, క్రిష్ణహరి, జనార్దన్ ఉన్నారు. వీరందరికీ వివాహాలు అయ్యాయి. అందరూ వారివారి రంగాల్లో రాణిస్తున్నారు. పెద్దకొడుకు శ్రీనివాస్–కవిత దంపతుల కూతుళ్లు విజేత, సాయిప్రియలకు సైతం వివాహాలు అయి పిల్లలు ఉన్నారు. పండుగల సందర్భంలో అందరూ ఇంటికి వస్తుంటారు. ఒకేచోట వేడుక జరుపుకుంటారు. 'నాకు నలుగురు కొడుకులు. మనుమలు, మనుమరాళ్లు ఉన్నారు. రెండు తరాల అనుబంధం మాది. పండక్కి కొడుకులు, కూతుళ్లు, అల్లుండ్లు, కోడళ్లు, మనుమలు, మనుమరాళ్లతో సందడిగా ఉంటుంది' అంటూ.. శ్రీపతి శ్రీహరి సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.



సకుటుంబ సపరివారంగా


కుటుంబసభ్యులతో బలరాం సెల్ఫీ

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మర్తనపేటకు చెందిన బుర్రవేణి కొండయ్య–లక్ష్మి దంపతులకు ముగ్గురు కొడుకులు. ఈ ముగ్గురూ ప్రభుత్వ ఉద్యోగులు. వేర్వేరుప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నా పండుగకు ఇంటికి వస్తుంటారు. పెద్దకొడుకు బలరాం సూర్యాపేటలో సబ్‌రిజిస్ట్రార్. రెండో కొడుకు మల్లికార్జున్ హైదరాబాద్‌లో పోలీస్‌కానిస్టేబుల్. చిన్న కొడుకు భాను జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం అంబారీపేట (ఎల్‌టీ)లో ప్రభుత్వ ఉపాధ్యాయుడు. పండుగ సందర్భంగా వీరంతా శనివారం సాయంత్రం మర్తనపేటలోని ఇంటికి చేరారు. కొండయ్య–లక్ష్మి దంపతులకు కొలనూర్, రామన్నపల్లె శివారుల్లో వ్యవసాయ భూమి ఉంది. వీరంతా పిల్లలతో పొలం వద్ద పండుగ జరుపుకుంటారు. కొండయ్య మనువలు అర్జున్, ఆదిత్య, మనవరాళ్లు ఆరాధ్య, అవంతికలతో మొక్కలు నాటించాడు. కోడళ్లు సంధ్య, రేఖ, చైతన్యలు సంక్రాంతికి పిండివంటలు చేస్తూ.. వేడుకల్లో భాగస్వాములు అయ్యారు. ఎక్కడ పని చేసినా.. పండుగకు సొంత ఊరుకు రావడం సంతోషంగా ఉంటుందని, అమ్మానాన్నలతో గడుపడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందని బలరాం, మల్లికార్జున్, భాను చెబుతున్నారు.


జగిత్యాలలోని గణేశ్‌నగర్‌లో భోగి పండుగ వేడుకలు

పండుగ కోసమే..


కుటుంబసభ్యులంతా ఒక్కచోట చేరి పిండివంటలు చేస్తూ...

పెద్దపల్లిరూరల్: ఉద్యోగరిత్యా హైదరాబాద్, చెన్నైలో ఉంటున్న రమేశ్, కిరణ్ సంక్రాంతికి పెద్దపల్లిలో నివాసముండే తల్లిదండ్రులు బొమ్మిదేని సమ్మయ్య, రాజేశ్వరి వద్దకు వచ్చారు. బొమ్మిదేని సమ్మయ్య ఎన్టీపీసీలో ఉద్యోగం చేసి పదేళ్లక్రితం పదవీవిరమణ పొందాడు. భార్య రాజేశ్వరి సహజ కవయిత్రి. వీళ్లకు ముగ్గురు కొడుకులు రమేశ్, కిరణ్, సతీశ్ సంతానం. రెండేళ్ల క్రితం కరోనాతో సతీశ్ మరణించాడు. రమేశ్ హైదరాబాద్‌లో, కిరణ్ చెన్నైలో ఏడేళ్లుగా ఉద్యోగం చేస్తున్నారు. రమేశ్, సునీతలకు ముగ్గురు, కిరణ్, భానుప్రియలకు ఇద్దరు, సతీశ్, శ్రుతిలకు ఇద్దరు సంతానం. పండుగకు అంతా ఒకేచోట చేరి సంతోషంగా గడిపారు.

సింగాపూర్ టు హుజూరాబాద్


టీవీ చూస్తున్న కుటుంబ సభ్యులు

హుజూరాబాద్‌రూరల్: సింగాపూర్‌లో ఉన్నా స్వదేశంపై ఉన్న మమకారంతో పండుగకు ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతాడు బైరి భిక్షపతి. శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన బైరి భిక్షపతి గతంలో బీఎస్ఎన్ఎల్‌లో పనిచేశాడు. సింగాపూర్‌లో సాఫ్ట్‌వేర్ కొలువు రావడంతో కుటుంబంతో సహా వెళ్లిపోయాడు. హుజూరాబాద్ పట్టణంలో ఆయన సోదరి ఉంటోంది. ఏదో ఒక పండుగకు కుటుంబంతో సహా హుజూరాబాద్ వస్తారు. చెల్లి ఇంట్లో ఓ వారం పాటు ఉండి తిరిగి సింగాపూర్ వెళ్లిపోతారు. ఈ సంక్రాంతికి వారం ముందగానే వచ్చారు.

అందరూ కలిసే..


అర్జున్- భీమక్క కుటుంబం

జగిత్యాల: ఉమ్మడిగానే అన్ని పండుగలు జరుపుకుంటామని జగిత్యాలకు చెందిన కొండేరి అర్జున్– భీమక్కలు చెబుతున్నారు. పట్టణానికి చెందిన అర్జున్–భీమక్కలకు ఐదుగురు కొడుకులు, కూతురు ఉన్నారు. కొడుకులు ఉద్యోగాల నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో ఉంటున్నా.. తండ్రి ఆదేశాలమేరకే నడుచుకుంటారు. పెద్దలు.. పిల్లలు అంతా కలిపి 25మంది వరకు ఉంటారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఇంటికి చేరి ఆనందంగా గడుపుతున్నారు.



18 ఏళ్లలో తొలిసారిగా..


గోపాల్‌రావుపల్లెలో కదారి కుటుంబం

సిరిసిల్లకల్చరల్: తంగళ్లపల్లి మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన బొల్లం నారాయణరెడ్డి సుమారు 20 ఏళ్ల కిందటే అమెరికా వెళ్లి స్థిరపడ్డాడు. సాఫ్ట్‌వేర్ కంపెనీ స్థాపించి రాణిస్తున్నాడు. నిరంతరం బిజీగా ఉండే జీవితాన్ని గాడిలో పెట్టే క్రమంలో ఏళ్లు గడిచాయి. సంక్రాంతి రోజైనా అయిన వాళ్లందరినీ ఒకే చోట చేర్చాలనుకున్నాడు. శనివారం పెద్దమ్మ, పెదనాన్న కదారి జయ, రాజారాం రెడ్డి ఉండే గోపాల్‌రావుపల్లె చేరుకున్నాడు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడిన పెద్దమ్మ కొడుకులు ఇద్దరు పవన్, సుధ, ప్రవీణ్, బస్వితో పాటు వాళ్ల పిల్లలు కలుసుకున్నారు. తన అర్ధాంగి వందన, కూతురు అనన్యతో పాటు అందరూ భోగి పండుగను జరుపుకున్నారు. సంక్రాంతిని సొంతఊరు బస్వాపూర్‌లో ఇంతే సందడిగా జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. సుమారు 18 ఏళ్ల తరువాత రెండు కుటుంబాల్లోని సభ్యులందరూ ఒకే చోటుకు చేరారు.

ఎంత బిజీగా ఉన్నా..


మల్లయ్యతో కుటుంబసభ్యులు

పెద్దపల్లిరూరల్: ఎవరి పనుల్లో వారు బిజీగా ఉంటున్నా పండుగ సమయంలో ఒకచోట చేరి సంతోషంగా గడుపుతామంటున్నారు పెద్దపల్లికి చెందిన మల్లయ్య. మల్లయ్యకు నలుగురు కొడుకులు కనకయ్య, రాము, వెంకటాచలం, నారాయణ, కూతురు వెంకటలక్ష్మి సంతానం. ఉద్యోగ రిత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. పండుగకు కుటుంబ సభ్యులతో గడిపేందుకు వెంటకలక్ష్మి కూతురు స్రవంతి ఆమెభర్త హరికృష్ణ, పిల్లలు సాత్విక్, అలోక్యతో పాటు శ్రీనివాస్, సుజాత, శ్యాంకుమార్, రాధిక, వెంకటాచలం, నారాయణ కుటుంబంతో సహా పెద్దపల్లిలోని వారి ఇంటికి వచ్చారు.

న్యూస్‌రీల్

నృసింహుని సన్నిధిలో జడ్జి


పూజలు చేస్తున్న జడ్జి దంపతులు

ధర్మపురి: రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి సీహెచ్‌కే భూపతి, తన కుటుంబసభ్యులతో కలిసి శనివారం ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకున్నారు. అనుబంధ ఆలయాల్లోనూ ప్రత్యేకపూజలు చేశారు. దేవస్థానం వారు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు బొజ్జ రమేశ్‌శర్మ, రెనోవేషన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగుపై అవగాహన


మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

జగిత్యాల: కంటి వెలుగు కార్యక్రమంపై స్థానిక రెండోవార్డులో కౌన్సిలర్ తోట మల్లికార్జున్ ఆధ్వర్యంలో శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈనెల 18 నుంచి రెండో విడతలో ప్రారంభమయ్యే కంటి వెలుగు కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆర్పీలు పాల్గొంటున్నారని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

'కొండ'పై గోదాదేవి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో గోదాదేవి- రంగనాథస్వామి

- భారీగా హాజరైన భక్తజనం

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి సన్నిధిలో శనివారం గోదాదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. గోదాదేవి– రంగనాథ స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం స్వామివారి కల్యాణం వైభవంగా జరిపించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి వివాహ తంపు వీక్షించారు. మరోవైపు.. గోదాదేవి కల్యాణం సందర్భంగా ఆలయ అధికారులు శాలువాలు, కండువాలను విచ్చలవిడిగా వృథా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదే విషయంపై ఆలయ కమిటీ డైరెక్టర్ పోచమల్ల ప్రవీణ్‌కుమార్ నేరుగా ఆలయ సూపరింటెండెంట్ సునీల్ దృష్టికి తీసుకెళ్లారు. కొందరు అధికారులు నిబంధనలు అతిక్రమిస్తూ ఎవరికి పడితే వారికి శాలువాలు, కండువాలు కప్పు ఆలయ సొమ్ము దుర్వినియోగం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. కార్యక్రజుమంలో ముత్యంపేట సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, ఆలయ చైర్మన్ మారుతీస్వామి, ఈవో వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

అంజన్న సన్నిధిలో భక్తజనం

శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

క్లుప్తంగా

వైభవంగా మకరజ్యోతి వేడుకలు



జ్యోతులు వెలిగిస్తున్న గురుస్వాములు

కోరుట్ల: స్థానిక అయ్యప్పగుట్ట అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం మకరజ్యోతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మెట్లపై జ్యోతులు వెలిగించారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం శబరిమలైలో కనిపించే మకరజ్యోతిని అయ్యప్ప ఆలయంలో టీవీ ద్వారా తిలకించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, గురుస్వామి చిదురాల నారా యణ, ఆలయ చైర్మన్ అంబటి శ్రీనివాస్ స్వామి, టీపీసీసీ నాయకులు జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సన్నిధి.. భక్తజన పెన్నిధి



వేములవాడ: రాజన్నను శనివారం సుమారు 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వరుస సెలవులు రావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

నిర్వహణ బాధ్యత కార్యదర్శులదే..

- అమలులోకి కొత్త నిబంధనలు
- జిల్లాలో 419 పల్లె ప్రకృతివనాలు

మల్లాపూర్(కోరుట్ల): జిల్లాలోని వివిధ గ్రామాల్లో పచ్చదనం పెంపు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల(పీపీవీ) నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను పంచాయతీ కార్యదర్శులకు అప్పగించింది. ఈ మేరకు ఇటీవల నిబంధనలు అమల్లోకి తెచ్చింది. ఇప్పటివరకు వీటి నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతల్ని ఉపాధిహామీ సిబ్బంది చూసేవారు. ఇకనుంచి పంచాయతీ కార్యదర్శులే ఆ పనులు చేపట్టాల్సి ఉంటుంది.

419 పల్లె ప్రకృతివనాలు..

- జిల్లాలోని 20 మండలాల్లో 380 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.
- 2020–21లో ఉపాధిహామీ ద్వారా 419 పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసి 7,70,435 మొక్కలు నాటారు.
- ఒక్కో పల్లె ప్రకృతి వనానికి సుమారు ఎకరం కేటాయించారు.
- ఒక్కోదాంట్లో 2 వేల – 3 వేల వరకు మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు.
- జిల్లాలో 51 బృహత్ పల్లె ప్రకృతి వనాలు కూడా ఏర్పాటు చేశారు. ఇందులో 48 బృహత్ పల్లె ప్రకృతి వనాలు పూర్తయ్యాయి.
- ఇందులో 5,98,080 మొక్కలు పెంచుతున్నారు.

అందుబాటులోకి పీపీవీ యాప్..

పల్లె ప్రకృతివనం(పీపీవీ) వివరాలను రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్ ద్వారా తెలుసుకునేందుకు ప్రత్యేక యాప్ అందుబాటులోకి తెచ్చారు. గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో ఐదు రకాల ఫొటోలు తీసి పల్లె ప్రకృతి వనం(పీపీవీ) యాప్‌లో నమోదు చేయాలి. ఇకనుంచి గ్రామ పంచాయతీ కార్యదర్శులే ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టి పనుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి.



రాఘవపేట గ్రామంలోని పల్లె ప్రకృతివనం

జిల్లా సమాచారం	
రెవెన్యూ డివిజన్లు	3
మండలాలు	20
గ్రామ పంచాయతీలు	380
పల్లె ప్రకృతివనాలు	419
నాటిన మొక్కలు	7,70,435
బృహత్ పల్లె ప్రకృతివనాలు	51
నాటిన మొక్కలు	5,98,080

గ్రామపంచాయతీలకు బాధ్యతలు



ఉపాధిహామీ నిబంధనల ప్రకారం ఇప్పటివరకు పల్లెప్రకృతి వనాలను ఈజీఎస్ సిబ్బంది నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రకారం ఇకనుంచి వాటి నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీ కార్యదర్శులే చూసుకోవాలి.

– లక్ష్మీనారాయణ, డీఆర్డీవో, జగిత్యాల

సెంటు భూమి పోనివ్వం

- ఎమ్మెల్యే సంజయ్



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: మాస్టర్ ప్లాన్‌తో రైతులకు నష్టం వాటిల్లకుండా చూస్తానని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాస్టర్ ప్లాన్‌లో ఒక్కసెంటు భూమి కూడా పోనివ్వకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. 20ఏళ్ల కోసారి మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు కేంద్రప్రభుత్వం ఆదేశాలు ఇస్తుందని, ఆ దిశలోనే సర్వే చేశామన్నారు. ఈక్రమంలో కొందరు అధికారులు పొరపాటు చేశారని, అయినా, ఇది ముసాయిదానేనని, మార్పులు, చేర్పులకు అవకాశం ఉంటుందని తెలిపారు. అభ్యంతరాల స్వీకరణకు సుమారు 60 రోజుల గడువు ఉందని, ఆలోగా రైతులు తమ అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా అధికారులకు సమర్పించాలని సూచించారు. కొందరు రాజకీయ నాయకులు తమ ఉనికి కోసం రైతులను రెచ్చగొడుతున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో రూపొందించిన మాస్టర్‌ప్లాన్ తప్పుల తడకగా ఉందని, అనేక మంది ఇంటి అనుమతులు రాక ఇబ్బందులు పడ్డారని గు ర్తుచేశారు. రైతులు ఆందోళన చెందవద్దని, ఏదైనా తనదే బాధ్యత అని ఎమ్మెల్యే అభయం ఇచ్చారు. ము న్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో పూజలు

స్థానిక రామాలయంలో గోదాదేవి రంగనాయులస్వామి కల్యాణ మహోత్సవం అంగరంగవైభవంగా జరిగింది. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆయనను ఘనంగా సన్మానించింది.

శివారు గ్రామాల్లో 'మాస్టర్‌ప్లాన్' నిరసనలు

- ఫ్లెక్సీలు దహనం



ఫ్లెక్సీ దహనం చేస్తున్న రైతులు

జగిత్యాలరూరల్: నర్సింగాపూర్, మోతె, తిమ్మాపూర్ గ్రామాల్లో శనివారం భోగి వేడుకలు నిర్వహిస్తూ మాస్టర్ ప్లాన్‌కు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. రిక్రియేషన్ జోన్ నుంచి తమ భూములు తొలగించాలని ఇళ్ల ఎదుట ముగ్గులు వేసి నిరసన తెలిపారు. నర్సింగాపూర్ నాలుగోవార్డు సభ్యురాలు ఆరె శ్రీలత తన పదవికి రాజీనామా చేశారు. తిమ్మాపూర్‌లో తిమ్మాపూర్‌లో రైతు సంఘం నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో మాస్టర్ ప్లాన్ రద్దుచేయాలని కోరుతూ భోగి మంటల్లో ఫ్లెక్సీ వేసి దహనం చేశారు. సర్పంచ్ మేరుగు రమ్య, ఉపసర్పంచ్ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మునీందర్‌రెడ్డి, రైతులు గంగాధర్, లచ్చన్న, విష్ణు, ఉమేశ్, చంద్రశేఖర్, తిరుపతి, సురేందర్‌రెడ్డి, అరుణ్ పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో పయనించాలి



క్రీడాకారులతో జువ్వాడి నర్సింగరావు

మల్లాపూర్(కోరుట్ల): యువత సన్మార్గంలో పయనించాలని పీసీసీ డెలిగేట్ సభ్యుడు, కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. వీవీరావుపేటలో నర్సింగం స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం అంతర్‌రాష్ట్ర వాలీబాల్ టోర్నమెంట్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత మానసిక వికాసానికి క్రీడలు దోహదపడతాయన్నారు. పాఠశాల దశ నుంచే విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సాహించాలని, మారుమూల ప్రాంతమైన వీవీరావుపేటలో 5 రాష్ట్రాల స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జువ్వాడి కృష్ణారావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోతు శేఖర్, నర్సింగం స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు మిట్టపెల్లి దివాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిభావంతో పండుగ జరుపుకోవాలి



ప్రచారం చేస్తున్న సభ్యులు

ధర్మపురి: జ్ఞానభావంతో సంక్రాంతి పండుగ జరుపుకోవాలని, భగవద్గీత ద్వారా భక్తి భావం పెంపొందించుకోవాలని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి కొడిమ్యాల కమిటీ అధ్యక్షుడు రాజేశ్ కోరారు. సంక్రాంతి వేడుకల సందర్భంగా నేరెళ్ల గ్రామంలో శనివారం భగవద్గీత ప్రబోధం, హిందూ ధర్మంపై ఇంటింటా ప్రచారం చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం మానవుడు అనేక కష్ట, దుఃఖాల్లో మునిగిపోతున్నాడన్నారు. మనశ్శాంతి లేని మానవులు దేవుని పూజించడమే కాకుండా భగవద్గీత పఠనం ద్వారా మోక్షం పొందవచ్చని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో జ్ఞాన వేదిక సేవా సమితి సభ్యులు ఆంజనేయులు, వేణు, నాగేశ్వర్‌రావు, విక్రమ్, దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ధర్మపురి: జైన గ్రామంలో శనివారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గల్ఫ్ దేశాల్లో ఉంటున్న గంగపుత్ర ఐక్య వేదిక క్యాలెండర్ ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు మేడి రమేశ్ మాట్లాడుతూ, ఐదేళ్ల క్రితం వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి వివిధ దేశాల్లో ఉంటున్న వారిని ఏకతాటిపై తీసుకురావడం కోసం గల్ఫ్ గంగపుత్ర ఐక్య వేదిక సంఘం స్థాపించామన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచులు కుడిక్యాల మహేశ్, ఎన్నం లక్ష్మారెడ్డి, ఉప సర్పంచ్ కొరుట్ల శ్రీనివాస్, లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ ప్రేమ్‌చందర్‌రావు, సంఘం వ్యవస్థాపకుడు సముద్రాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సముద్రాల రమేశ్, కార్యదర్శి చంద్రయ్య, నాయకులు సంగెపు గంగారాం, రూప, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించకుంటే ఆందోళనలు

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి
- మాతాశిశు ఆస్పత్రిలో అసౌకర్యాలపై ఆగ్రహం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆస్పత్రిలో వెంటిలేటర్ సౌకర్యం లేకున్నా.. ఉన్నదని సూపరింటెండెంట్ తప్పుడు సమాచారం ఇచ్చారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మాతాశిశు ఆస్పత్రిని ఆయన శనివారం సందర్శించారు. వైద్యసేవలపై ఆరాతీశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. అత్యవసరమైన వెంటిలేటర్ సౌకర్యం లేక పేషెంట్లను కరీంనగర్ రెఫర్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎక్స్‌రే యూనిట్ ప్రారంభించిన ఆర్నెల్లకే మూలనపడిందని, దానిని ఎందుకు మరమ్మతు చేయించడం లేదని ఆయన ప్రశ్నించారు. సమస్యలు కప్పిపుచ్చడం మానుకుని లోపాలు సరిదిద్దుకోవాలని సూచించారు. గర్భిణుల ప్రోత్సాహకం రూ.20కోట్లు వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని ఆర్భాటంగా ప్రారంభించినా జగిత్యాలలో నేత్ర శస్త్రచికిత్స చేసే సౌకర్యం లేకపోవడం దారుణమని పేర్కొన్నారు. సూపరింటెండెంట్, ఆర్ఎంవో స్థానికంగా నివాసం ఉండేలా చొరవ తీసుకుని వైద్యసేవలు విస్తరించాలని జీవన్‌రెడ్డి కలెక్టర్‌కు విన్నవించారు.

నిషేధిత మాంజా వినియోగిస్తే చర్యలు



తనిఖీ చేస్తున్న పట్టణ సీఐ కిశోర్

జగిత్యాలక్రైం: నిషేధిత చైనా మాంజా ఉపయోగిస్తే చర్యలు తప్పవని ఎస్పీ సింధూశర్మ హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంతోపాటు పలుచోట్ల నిషేధిత చైనా మాంజాను విక్రయించే దుకాణాల్లో తనిఖీ చేశారు. గాలిపటాల కోసం వినియోగించే మాంజా పూత రాసిన నైలాన్, సింథటిక్ దారాలు పక్షులు, పర్యావరణం, మనుషులకు హాని చేస్తాయని అన్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాలను అనుసరించి చైనా మాంజా వినియోగాన్ని నిషేధించారని అన్నారు. చైనా మాంజా తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా డయల్ 100కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని సూచించారు. దాడుల్లో పట్టణ సీఐ కిశోర్, ఎస్సైలు అనిల్, రాము, రమేశ్ పాల్గొన్నారు.

నలభై ఏళ్లుగా తెలంగాణలోనే..



వేములవాడ: ఆంధ్రా ప్రాంతం నుంచి ఉపాధి కోసం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జగిత్యాల, వేములవాడ ప్రాంతాలకు వలస వచ్చిన కొందరు ఏటా సంక్రాంతి పండుగను ఇక్కడే జరుపుకుంటున్నారు. చిట్టి రామారావు–శ్రీకుమారి దంపతులతోపాటు చాలా మంది ఇక్కడే ఉపాధి పొందుతున్నారు. ఆంధ్రా ప్రాంతానికి చెందిన వారంతా ఇక్కడే తమ బంధువుల మధ్య పండుగ చేసుకుంటున్నారు. శనివారం భోగిని పురస్కరించుకుని వేములవాడలోని చెక్కపల్లి రోడ్డులో ఇలా ఒకే చోట చేరారు. తీరొక్క పిండి వంటకాలతో పండుగ చేసుకున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

LAND FOR SALE

- గజాల్లో కాదు ఎకరాల్లో భూమిలో పెట్టుబడి పెట్టండి. హైదరాబాద్ చేవెళ్ల దగ్గర, అర ఎకరం 70లక్షలు/1 ఎకరం 1.40 కోట్లు, క్లబ్ హౌస్ కూడకలదు. ఫోన్ : 9951297569. [HA-868]

SERVICES

- 1 ఎకరం భూమి ఉన్న రైతులకు డైలీ లేబర్‌కు 5 లక్షల వరకు గృహ రుణం ఇవ్వబడును. సంప్రదించండి ఫోన్ : 9014653011. [H-786787]

WANTED

- ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776024]
- త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోవడానికి వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం, జీ: 18K ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్.9848571888, 7569955551. [H-786819]
- Wanted Operators - (15), Salary-15k, ESI + PF+ Accomidation, Qly: 10+, Ph: 9110783252 [HA-779937]
- Dherji సైట్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. PVR Projects Ltd., మహారాష్ట్ర. ఫోన్: 040-23348080, 23338080 Email:adm.vineela@gmail.com [HA-779938]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824